

నేడు సివిల్ సర్వీసెస్ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024 ఆదివారం నాడు జరగనున్నాయి. అనంతపురంలో 7 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 2,795 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షల నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో ఉన్న ప్రశ్న పత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేశామన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను సకాలంలో పటిష్ట భద్రత మధ్య తరలించాలన్నారు.పరీక్షల కోసం అనంతపురం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్‌ను 8500292992ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బడి బస్సు భద్రత ఎంత..?

◆ రోడ్డుపైకి ప్రయివేటు పాఠశాలల బస్సులు
◆ ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి
◆ బస్సుల కండీషన్, డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించాల్సిందే...

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పుస్తకాలు చేతబట్టి బడులకు వెళ్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే పిల్లలు బస్సుల ద్వారా ఆయా పాటశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ బడి బస్సుల భద్రత ఎంత అన్నదానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రయివేటు యాజమాన్యం నడిపే బస్సులు ఫిట్‌నెస్‌తో ఉన్నాయా.. లేదా అన్న సందేహాలు ఉన్నాయి. పిల్లలను తీసుకెళ్లే వాహనాలు కావడంతో వాటి భద్రతపై తల్లిదండ్రులు పరిశీలన చేసుకోవాల్సి ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల రావడంతో విద్యావిధానం తీరు మారింది. విద్యా బోధన నుంచి, పాఠశాలకు పిల్లలు వెళ్లే వరకు అంతా ప్రయివేటు ఆధీనంలోకి వెళ్లింది. ముఖ్యంగా ప్రయివేటు పాఠశాలలు విద్యార్థులను చేరవేసేందుకు ప్రయివేటు బస్సులను ఉపయోగిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం ఇంటి నుంచి పాఠశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు 1272 ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 550 బస్సులు ఉంటాయి. వీటిలో ప్రతి రోజు వేలాది మంది విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యా సంస్థల యాజమాన్యాలు బస్సుల నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. పాఠశాలల బస్సులకు సంబంధించి రవాణా శాఖకు ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించు కోవాల్సి ఉంది. అయితే చాలా వరకు యాజమాన్యాలు ఆదిశగా ఆసక్తి చూపుతున్న దాఖలాలు తక్కువగానే కన్పిస్తున్నాయి. విద్యార్థుల ప్రయాణ విషయంలో యాజమాన్యాలు అన్ని జాగ్రత్తలతో పత్రాలు సమకూర్చుకుని ఫిట్‌నెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణ శాఖ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. మరి వీటిని ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఏ మేరకు అమలు చేస్తున్నాయన్న దానిపై సందేహాలు నెలకొన్నాయి.

నిబంధనలు ఇలా..

◆ పాఠశాల బస్సులకు సామర్ధ పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా రవాణా శాఖ కార్యాలయంలో అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, బీమా, పొల్యూషన్ పత్రాలు, డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ అందించి పరీక్షలు చేయించుకోవాలి.

◆ బస్సు కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసలా ఇనుప రక్షణ కంచెను ఏర్పాటు చేయాలి.

◆ బస్సులో ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండాలి.

◆ బస్సు నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్ల లోపే ఉండాలి, డ్రైవర్‌కు ఐదేళ్ల హెవీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి.

◆ డ్రైవర్‌తో పాటు విద్యార్థులు బస్సు ఎక్కినప్పుడు, దిగినప్పుడు చూసుకునేందుకు సహాయకుడు ఉండాలి. పిల్లలు బస్సుకు ఎక్కేందుకు వీలుగా అదనపు మెట్లు ఏర్పాటు చేయాలి.

◆ బస్సులో ఏదైని అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా అగ్ని ప్రమాద రక్షణ సిలిండర్ ఉండాలి.



ప్రశాంతంగా బక్రీద్ నిర్వహించేలా చర్యలు

ఎస్పీ గౌతమిసాలి, జాయింట్ కలెక్టర్ కేతన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎస్పీ గౌతమిసాలి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌లు తెలియజేశారు. ఈనెల 17న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టాల్సిన సన్నాహక ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 17న సోమవారం నాడు బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకునేలా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సంఘటనలూ చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పొలాలు/బహిరంగ ప్రాంతాలలో జంతువుల రవాణాను అడ్డుకోవడం, శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే దుండగులపై నిఘా ఉంచాలన్నారు. పోలీసు అధికారులు శాంతిభద్రతలను పర్యవేక్షించాలని, ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. మార్కెట్ యార్డులు, ఈద్గాలు, మసీదులు మరియు కబేళాల వద్ద పార్కింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రవాణా సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ బక్రీద్ ప్రార్థనల నిమిత్తం ఈద్గా పరిసరాలన్నింటినీ శుభ్రం చేయాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణ చేయాలన్నారు. కబేళాల దగ్గర గోవధ చేయరాదని తెలిపారు. ఈద్గాలు, మసీదు, దర్గాల వద్ద పారిశుధ్య సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, నిరంతర నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకోసం తహశీల్దార్లు మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో రాణి సుస్మిత, సివిల్ సప్లయ్ డిఎం రమేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, ఎస్‌డిసి ఆనంద్, డిపిఒ ప్రభాకర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ, జాయింట్ కలెక్టర్

బక్రీద్ వేళ భద్రతా చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ గౌతమిసాలి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అన్ని మతాల వారితో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అభ్యంతరకరమైన పోస్ట్ షేర్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంతు వధశాలల వద్ద నీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు ఎస్పీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం నాడు అనంతపురం నగరంలోని నాయక్‌నగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో గదులన్నీ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు అందుబాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. గదుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు హాస్టల్‌కు వచ్చేలా ఫోన్లు చేసి పిలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని , గుత్తి రోడ్డు (నీరుగంటి వీధి), శ్రీనివాస నగర్ (జూనియర్ కాలేజీ) మరియు బళ్లారి రోడ్ చౌరస్తాలో ఉన్న అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ మేఘా స్వరూప్ సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ నిబంధనల మేరకు అన్న క్యాంటీన్లను పున్ణ ప్రారంభమునకు చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీర్లకు మార్గనిర్దేశం చేశారు. అన్న క్యాంటీన్ పూర్తిస్థాయిలో నిర్వహణకు అవసరమైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ సూర్యనారాయణ, డి.ఈ సుభాష్ చంద్రబోస్ మరియు ఆమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లి చెరువు ఆక్రమణ



ఆక్రమణకు గురైన అయ్యవారిపల్లి చెరువు

యథేచ్ఛగా కబ్జా
తగ్గుతున్న నీటి సామర్థ్యం
ఆందోళనలో రైతులు
ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
అయ్యవారిపల్లి చెరువులో పరిస్థితి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు ఆక్రమణకు గురవుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. అయ్యవారిపల్లికు ఆనుకుని సర్వే నెంబర్ 28లో 6504 ఎకరాల్లో చెరువు ఉంది. వర్షాధారమైన ఈ చెరువు పశువులు, అడవి జంతువులకు ప్రధాన నీటి వనరు. ఒక్కసారి ఈ చెరువు నిండితే నలువైపులా సుమారు ఐదు కిలోమీటర్ల మేర వ్యవసాయ బోర్లకు నీటి కొరత ఉండదు. ముఖ్యంగా భూగర్భజలాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఈ చెరువు కింద గతంలో 36వేల ఎకరాలు సాగు ఉండేది. ఐదేళ్ల క్రితం హంద్రీనీవా ద్వారా చెన్నారాయని కుంట నుంచి ఈ చెరువును నీటితో నింపారు. తద్వారా ఆ గ్రామ ప్రజల దహర్తినే కాకుండా వ్యవసాయ బోర్లకు నీటి కొరత లేకుండా పంటలు పండించుకునేవారు. ఈనేపథ్యంలో సుమారు 15 మంది ఆక్రమణదారులు అర్ధ ఎకరా వరకూ చెరువును పూడ్చి తమ సొంత కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు ఏకంగా కబ్జాకు యత్నించారు. దీంతో గ్రామ మాజీ సర్పంచి దామోదర్‌రెడ్డి ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరింతగా చెరువు కబ్జా పెరిగింది. ఇది ఇలాగే కొనసాగితే చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి విపత్కర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అంతేగాకుండా గతంలో మాదిరిగానే చెన్నరాయకుంట చెరువు నుంచి హంద్రీనీవా జలాలతో చెరువును నింపాలని రైతులు, పశు పోషకులు కోరుతున్నారు.



చెరువును ఆక్రమించుకుని వేసిన గడ్డివాయి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

క్యాన్సర్ వ్యాధి నివారణ అందరి బాధ్యత

డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

వ్యాన్సర్ వ్యాధి నివారణ మనందరి బాధ్యత అని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇబి.దేవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులు, సిహెచ్‌ఓలు, అర్బన్ ఏఎన్‌ఎంలకు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా రొమ్ము, నోరు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. మహిళలు ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము, పరీక్ష చేసుకోవడం నేర్చుకోవాలన్నారు. అలాగే దుర్వాసనతో కూడిన తెల్లబట్ట వంటి లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే తగిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడేవారు నోటిలో ఎలాంటి పుండ్లు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాన్నారు. తద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ 30ఏళ్ళ పైబడిన ప్రతి మహిళా సర్వైకల్ స్క్రీనింగ్ పరీక్ష, 18ఏళ్లపైబడిన ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము పరీక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన బుక్‌లెట్లు విడుదల చేశారు. అనంతరం జిల్లా క్యాన్సర్ నోడల్ ఆఫీసర్ నిహారిక, డిస్టిక్ ట్రైనర్స్ డాక్టర్.ప్రమోద్, డాక్టర్ కుముదా, ఉదయభాను, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మహేంద్రనాథ్ శిక్షణ ఇచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, డిపిఎంఒ రవిశంకర్, ఎన్‌సిడి వైద్య సిబ్బంది ఆంజనేయులు, మౌనిక, శశికళ, కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'పయ్యావుల'కు సన్మానం

వజ్రకరూరు : ఆర్థికశాఖ మంత్రిగా ఎన్నికైన పయ్యావుల కేశవ్‌ను ఉరవకొండ టిడిపి సీనియర్ నాయకులు నర్రా కేసన్న మర్యాదపూర్వకంగా కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆర్థికమంత్రిగా పయ్యావుల కేశవ్ ఎన్నిక కావడం నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకుంటూ ప్రభుత్వానికి సహకరించడంతోపాటు సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని డీఎస్పీ జనార్ధన్ నాయుడు సూచించారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలు, కార్పణాలు చోటు చేసుకునేలా ఏ ఒక్కరూ నడుచుకోకూడదన్నారు. శిలాఫలకాలు, ప్రభుత్వ ఆస్తులను నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారిపైన అయినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుర్తింపు పొందుటకు క్షణికావేశంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు.




మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధన్‌నాయుడు

దొంగతనాలపై ప్రత్యేక దృష్టి

ఇటీవల పట్టణంలో జరిగిన దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రాత్రిం బవళ్లు మొబైల్ టీములు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ప్రజలు దొంగతనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చోరీ సొమ్మును రికవరీ చేయడానికి, దొంగలను పట్టుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నం కొనసాగిస్తున్నామన్నామ వివరించారు.

నీట మునిగిన పత్తిపంట పరిశీలన



నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సాయికుమార్

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన పత్తి పంటను వ్యవసాయ అధికారి సాయికుమార్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్టు తల్లి వేరు కుళ్లిపోకుండా పంటపొలాల్లో నీటిని బయటకు వదలాలన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే శ్రావణిశ్రీని కలిసిన నాయకులు

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మండల టిడిపి నాయకులు శనివారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిశారు. ఇందులో భాగంగా మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఫోన్‌లో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, పాటిల్ సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డిపల్లి రామమునిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కాలవ శ్రీనివాసులుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలువ శ్రీనివాసులు శనివారం తొలిసారిగా రాయదుర్గానికి విచ్చేయడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహ నుంచి లక్ష్మీబజార్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా శాంతి నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ భారీ గజమాలలతో స్వాగతం పలికారు. వాహనంపై కాలవ శ్రీనివాసులతోపాటు తనయుడు భరత్, మాజీ వైస్‌ఛైర్మన్ మాహబూబ్‌బాషా, పాటిల్ అజయ్, జనసేన నాయకులు మంజునాథ్ ఉన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు గొడిసెలపల్లి హనుమంతురెడ్డి, హనుమంతు, గుమ్మఘట్ట క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, నాయకులు పాటిల్ సదాశివరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగళి రాజు, నరేష్‌రెడ్డి, షమీవులా, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానం

ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టంకశాల హనుమంతును శనివారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పని చేసే వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలపడంతోపాటు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఏ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు షఫీ, రీజనల్ ఉపాధ్యక్షులు దామోదర్, డిపో అధ్యక్షులు జిలాన్ , డిపో కార్యదర్శి స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎన్ఎంయు నాయకులు

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరంలోని ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. ఈమేరకు హౌసింగ్ బోర్డు ఈద్గా మైదానాన్ని హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వారంరోజులుగా ఈద్గా మైదానంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, నీటి సౌకర్యం, నమాజ్‌కు అవసరమైన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, అబూసాలెహా, ఇషాక్, రహంతుల్లా, శంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



బక్రీద్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి
www.prajasakti.com

InThe Court of The IIIrd Addl. Junior Civil Judge, (Excise Court) Ananthapuramu.
O.S. No. 149/2023.

Between:
UCO Bank Rep.by its Branch Manager, Raju Road, Ananthapuramu ...**Plaintiff**
And
T.Noor Mohammed
and another ...**Defendants**

NOTICE TO DEFENDANT NO:1 and 2

D1:T.Noor Mohammed S/o T.Ahammed Rasool,
D2:T.Ahammed Rasool Both are R/of D.No:11-201, Sai Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 02-08-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
T.RAJARAM, Advocate
Ananthapuramu, Cell:9440286323

InThe Court of The Ist Addl. Junior Civil Judge, Ananthapuramu.
O.S. No. 101/2021.

Between:
N.Rami Reddy ...**Plaintiff**
And
S.Seshasayana Reddy ...**Defendant**

NOTICE TO DEFENDANT

To,
S.Seshasayana Reddy S/o S.Subba Reddy, Business, R/of D.No:6-2-721, Kovur Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 01-07-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.SREENIVASA REDDY, Advocate
Ananthapuramu, Cell:9848226646

InThe Court of The Ist Addl. Junior Civil Judge, Ananthapuramu.
E.P. No. 348/2023 in O.S. No. 331/2022

Between:
Bontha Raja Sekhar Reddy ...**Petitioner/D.Hr**
And
1.Bellam Lakshmi Devi
2.Ravi ...**Respondants/J.Drs**

Notice To J.Dr No:1 and 2

J.Dr No:1:Bellam Lakshmi Devi W/o B.Ranga Swamy, R/at Ajaygosh Colony, Rudrampeta Village,Ananthapuramu Rural Mandal.
J.Dr No:2:V.Ravi S/o V.Ramachandra, R/at D.No:6-2-78, Ajaygosh Colony, Rudrampeta Village, Ananthapuramu Rural Mandal.

పై నెంబరు E.P.లో J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 24-06-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.RAMI REDDY,
G.RAMAKRISHNA REDDY,
Advocates, Ananthapuramu,
Cell:9849667645, 9963369845.

InThe Court of The Senior Civil Judge, Gooty
I.P. No. 33/2022

Between:
B.V.Rathnaiah ...**Petitioner**
And
M.Damodar and others ...**Respondants**

Notice To Respondant No:14

R14:Patil Anand Reddy S/o P.Somi Reddy, R/at D.No:17/127, Thilak Nagar, Guntakal Town Ananthapuramu Dist.

పై నెంబరు కేసులో 14వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 22-07-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
టి.ధనుంజయ,
పిటీషనరు పరం వకీలు, గుత్తి
సెల్:9885896307

InThe Court of The Prl. District Judge, Ananthapuramu.
E.P. No. 518/2023 in A.A. No. 19/2016.

Between:
M/s Shriram Finance Limited, Rep by its Anthorized Signatory, Guntakal Branch. ...**Decree Holder**
And
1.R.Ramesh naik, D.No:9/3/241, Indira Nagar, Uravakonda, Ananthapuramu Dist.
2.C.Suresh Babu S/o Sreenivasulu, D.No:10/2/11, Word No:10, Uravakonda, Ananthapuramu Dist. ...**Judgement Debtors**

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 25/06/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

The property situated within the limits of Uravakonda or Uravakonda Village Within the SRO Uravakonda and RD Ananthapuramu. The details are furnished hereunder.

S.No.	SURVEY NUMBER	EXTENT
1.	522-A 522-B	240 SQ.YDS

BOUNDED BY:
EAST: Plot No.43 Bommisetty Anjineyulu House **WEST:**Plot No.45 Thalari Ratnamma Site **NORTH:**40 Feet Road **SOUTH:**Ramavath Achammakottam
అమిన వాల్యు రూ.10,00,000/-
D.Hr వాల్యు రూ. 4,00,000/-

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.PRABHAKAR REDDY, Advocate
Ananthapuramu, Cell:9441380404

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వజ్రకరూరు

దోమకాటు వల్ల వ్యాపించే మలేరియా వ్యాధిపై ప్రజలతోపాటు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ సూచించారు. మలేరియా వ్యతిరేక మసోత్సవంలో భాగంగా ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్లలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా జ్వరం దోమకాటు వల్ల వస్తుందన్నారు. కావున ఇంటితోపాటు పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు రావన్నారు. మొదట చలిగా అనిపించి తర్వాత అధికంగా జ్వరం వచ్చి చమటలు పట్టి జ్వరం తగ్గిపోతే మలేరియా జ్వరంగా భావించి వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. ఇకపోతే నీటి నిల్వలు లేకుండా చేయడం, అయిల్ బాల్స్ వేయడం లాంటి చర్యలతో దోమలను పుట్టకుండా చూసుకోవలన్నారు. అనంతరం కిటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు స్వర్ణలత, శేఖర్, సీఓ.భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

ఎంపీ, ఎమ్మెల్యే అంబికా, దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. శనివారం నగరంలోని పెద్దాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించి వైద్యం వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పుడు శుభ్రంగా ఉండాలన్నారు. ఏవైనా అవసరాలు ఉంటే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావు, మాజీ మేయర్ స్వరూప, నాయకులు బుగ్గయ్య చౌదరి, గంగరామ్, సరిపూటి శ్రీకాంత్, లక్ష్మీనరసింహ, పోతుల లక్ష్మీనరసింహులు, నారాయణస్వామి, నారాయణస్వామి యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా

క్రికెట్ పోటీలు ప్రారంభం

నగరంలోని పిటిసి మైదానంలో ఏర్పాటు చేసిన సౌత్‌జోన్ అండర్ 14 బాలబాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ తనకు కూడా క్రికెట్ అంటే చాలా ఇష్టమన్నారు. గతంలో క్రికెట్ బాగా ఆడే వాడినని గుర్తు చేసుకున్నారు.

సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ఐదు హామీలపై సంతకాలు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, నాయకులు శ్రీధర్‌చౌదరి, ఆదెన్న, బుగ్గయ్య చౌదరి, జెఎల్.మురళి, రాయల్ మురళి, స్వరూప, సూర్యనారాయణ, గాండ్ల విశాలాక్షి, గౌస్ మొద్దీన్, తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యేకు ఎపిజిఇఎ శుభాకాంక్షలు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను పలువురు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపీకృష్ణ, రామునాయక్ కలిసి ఉద్యోగుల సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా సహ అధ్యక్షులు శివశంకర్, జిల్లా కోశాధికారి మహేష్‌నాయక్, నగర అధ్యక్షులు జె.శివశంకర్, ప్రధాన కార్యదర్శి హనుమంతు, నగర సహాధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి రాఘవేంద్రరావు, నగర ఉపాధ్యక్షులు వెంకట రామిరెడ్డి, ఖాజా, రవీంద్ర, యాగంటి, రాజశేఖర్, అనిల్, రాజు, రామంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల కవి 'శ్రీశ్రీ'

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

'మానవుడే నా సందేశం.. మనుష్యుడే నా సంగీతం' అని ఎలుగెత్తి చాటిన కష్టజీవుల మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య మాట్లాడుతూ శ్రమజీవుల జీవితాల్ని పూర్తిగా ప్రేమించిన హృదయం ఉన్న కవి శ్రీశ్రీ అన్నారు. గొంతులేని కష్టజీవులను తన వాళ్లుగా చేసుకుని కలం పట్టిన అక్షర యోధుడు శ్రీశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, ఎస్‌కెయు తెలుగు శాఖలో అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, జాషువా సాహిత్య పీఠం ఆర్గనైజింగ్ సెక్రటరీ పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు, శ్రీ శ్రీ అభిమానులు సాయి, వెంకటరమణ నాయుడు, వాల్మీకి పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఎంపిడిఒ


మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

బెలుగుప్ప : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా 15వ ఆర్థిక కమిషన్ నిధుల స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లు నిర్వాణపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జగదీష్, గోపాల్, రవికుమార్, పాండు, ప్రవీణ్‌కుమార్, ఉమాశంకర్, అశోక్, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌పై సమీక్ష

వజ్రకరూరు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీంపై ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుబ్బరాజు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు శనివారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌కు సంబంధించిన విధి విధానాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సాయిరామ్‌నాయక్, జనార్దన్, మల్లికార్జున, సాయికృష్ణ, తిప్పేస్వామి, దుర్గాప్రసాద్, శిల్ప, పద్మప్రియ, సునీత, రేఖ, అనిల్‌కుమార్, హరికృష్ణ, పావనకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి

పెద్దపప్పూరు : గ్రామాల్లో సమస్యలను సృష్టించుకోకుండా ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ గౌస్ సూచించారు. శనివారం మండలం పరిధిలోని తిమ్మచెరువు గ్రామంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించకుండా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేగాకుండా మీరు చేసే తప్పిదాల వల్ల మీ పిల్లల భవిష్యత్తు దెబ్బ తింటుందన్నారు. కావున ఎవరూ గొడవల జోలికి వెళ్లకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లపల్లి విజయ్‌భాస్కర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

అనంతపురం క్రైం : ఎపి రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్‌పై సస్పెన్షన్ ఎట్టకేలకూ ఎత్తేశారు. ఉద్యోగులకు పాతపెన్షన్ మంజురు చేయాలని, నగదు రహిత వైద్యం అందించాలని, ఆర్థిక బాకాయిలు మంజూరు చేయాలని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని తెలుపుతు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈనేపథ్యంలో తిరిగి సస్పెన్షన్ ఎత్తేయడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పాఠశాల ప్రారంభ వేడుకలు

అనంతపురం : స్థానిక రాచానపల్లిలోని ఉన్న సంసిద్ పాఠశాలలో శనివారం పాఠశాల పున్న ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులు, విద్యార్థులను గౌరవప్రదంగా పాఠశాలకు ఆహ్వానిస్తూ మంచి వాతావరణం పరిచయం చేసే దిశలో ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో సంసిద్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేయాలి

అనంతపురం : రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు కోరారు. ఈమేరకు సీఎం చంద్రబాబుతోపాటు గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికు లేఖ రాశారు. అక్రమాలపై సమగ్రమైన విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. ప్రజాప్రతినిధులు అయితే ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వజ్రకరూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి సూచించారు. శనివారం ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలో దోమల నివారణ కోసం పలుచోట్ల ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీటిని నిల్వ చేసుకోకూడదన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఉరవకొండలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి, గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.గౌస్‌సాహెబ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యకు డిమాండ్

వజ్రకరూరు : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు హరుణ్ రషీద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉరవకొండ మండల విద్యాశాఖ అధికారి-2కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలలు పుస్తకాలు, యూనిఫామ్ అంటూ పేదలకు మాయమాటలు చెప్పి నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. అంతేగాకుండా ప్రభుత్వం నిర్దేశించిన స్కూల్ ఫీజు పట్టికను ప్రతి ప్రయివేట్ పాఠశాలలో ప్రజలకు కనబడేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

అనంతపురం : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు వాణిశ్రీ, బద్రీనాథ్ పెళ్లిరోజుతోపాటు తన పుట్టినరోజును పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శేషాద్రి, సౌధామణి, సుబ్రమణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, ఓబుళపతి, రవికుమార్, లక్ష్మీనారాయణ, పల్లవి, నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఈ-లర్నింగ్‌లో 'గేట్స్' ప్రతిభ


గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల, (ఇన్‌సెట్‌లో) కళాశాల ఎండి జి.రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

ఎన్ పీటీఇఎల్ సర్టిఫికేషన్ కోర్సుల కోసం నిర్వహించిన జాతీయస్థాయి ఈ-లర్నింగ్ ఫలితాల్లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ జి. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇ లెర్నింగ్ వేదికకు ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఎన్‌పిటిఈఎల్ సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తారన్నారు. జాతీయస్థాయిలో ఈ కోర్సులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించగా ఈ ఫలితాల్లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు 167వ స్థానం దక్కిందని వివరించారు. ఎన్‌పిటిఇఎల్ ఫలితాల్లో గేట్స్ టాప్ 200 కళాశాలల్లో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉత్తమ ప్రతిభ చూపడంతో కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి హర్షం వ్యక్తం చేశారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు : ఆర్‌డిఒ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాణీసుస్మిత

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఈనెల 17న నిర్వహించుకునే బక్రీద్ పండగకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్‌డిఒ రాణీసుస్మిత తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాయదుర్గం పట్టణానికి చెందిన ముస్లిం మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తీసివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సౌకర్యం ఉన్నచోట మున్సిపాలిటీ చెత్త వాహనాన్ని, సౌకర్యం లేని ప్రదేశంలో ఆటోలను ఏర్పాటు చేసి మూడు రోజులపాటు ప్రతి రెండు గంటల సమయానికి ఒకసారి వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈద్గా, మసీదుల వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని విపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అజహర్‌ను ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతూ సహృదభావంతో బక్రీద్ పండుగను జరుపుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కనేకల్ రోడ్డులోని ఈద్గా వద్ద ఏడు గంటలకు, బిటిపి రోడ్డులోని ఈద్గా వద్ద ఏడున్నర గంటలకు, బళ్లారి రోడ్డులోని ఈద్గా వద్ద ఎనిమిది గంటలకు బక్రీద్ నమాజులు జరుగుతాయని ముస్లిం పెద్దలు వివరించారు. ప్రభుత్వ ఖాజీ సైపుల్లా మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో పండుగలు జరుపుకుంటామన్నారు. దీపావళి, వినాయక చవితి, దసరా, రంజాన్, బక్రీద్ పర్వదినాల సందర్భంగా స్వేచ్ఛాయుత వాతావరణం లో జరుపుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సనావుల్లా, యూనుస్, మజీద్, బ్రెడ్ శర్మాస్, రాయదుర్గమ్మ రూరల్ సీఐ ప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెరుగుతున్న షుగర్ వ్యాధిగ్రస్థులు

బిపి, డయాబెటిక్ వైద్యులు డాక్టర్ డి.మధుసూదన్



ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుతం పరిస్థితుల్లో షుగర్ వ్యాధి బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని బిపి, డయాబెటిస్ వైద్యులు డాక్టర్ డి.మధుసూదన్ తెలిపారు. ప్రపంచ మధుమేహ వ్యాధి వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మధుమేహం అనేది ఇన్సులిన్ లోపం వల్ల శరీరంలోని జీవక్రియ అస్తవ్యస్తమైన స్థితి, దీని ఫలితంగా హైపర్గ్లైసీమియా, సంబంధిత సమస్యలు ఏర్పడతాయన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి సాధారణంగా పూర్తి ఇన్సులిన్ లోపం కారణంగా యుక్త వయసులో ఉన్నవారిలో, డయాబెటిస్ ఇన్సులిన్ వల్ల, గర్భధారణ సమయంలో మధుమేహం ప్లాసెంటల్ హార్మోన్ల కారణంగా, ఇన్సులిన్ నిరోధకత కారణంగా వస్తుందన్నారు.

అంతేగాకుండా ఇతర రకాల మధుమేహం జన్యుపరమైన కారణాల కారణంగా కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో మధుమేహం ప్రాబల్యం 11.4 శాతంగా ఉందన్నారు. దాదాపు 10.1 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. యుక్త వయసు ఉన్న వారిలో ఎక్కువగా ప్రభావ చూపుతోందన్నారు. ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, కుటుంబ చరిత్ర, వయస్సు, నిశ్చల జీవనశైలి, గర్భధారణ మధుమేహం వంటికి డయాబెటిస్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాలు అన్నారు.

జీవనశైలిలో మార్పులు చేయాలి..

జాగింగ్, ఆటల ఆడటం, కార్డియాక్ వర్కౌట్‌ల వంటి మితమైన తీవ్రతతో కూడిన వ్యాయామం చేయాలన్నారు. కార్బోహైడ్రేట్‌లు, కొవ్వు పదార్థాలను తగ్గించేటప్పుడు ప్రోటీన్, ఫైబర్ కంటెంట్‌ను పెంచడం వంటి ఆహార మార్పులు చేసుకోవాలన్నారు. సరైన సమయంలో నిద్రపోవాలని, ఒత్తిడి స్థాయిలను తగ్గించుకోవాలని, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కాగా మధుమేహం ఏర్పడిన తర్వాత క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వారు సూచించిన మందులనే వాడాలన్నారు. మధుమేహం సరైన నియంత్రణ కోసం ఇన్సులిన్‌లతో పాటు అనేక ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మతసామరస్యంతో బక్రీద్‌ను జరుపుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మతసామరస్యంతో బక్రీద్ ను జరుపుకోవాలని, ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం కమిషనర్ చాంబర్ నందు బక్రీద్ పండుగ సందర్భంగా అధికారులతో నగరపాలక సంస్థ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను మత సామరస్యానికి చిహ్నంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి ఈద్గాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి.రామసుబ్బా రెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ప్రతాప్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, అనంతపురము డిప్యూటీ తహశీల్దార్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : బక్రీద్ పండుగను ముస్లిం సోదరులందరూ సామ్రాస్యంగా, శాంతియుతంగా చేసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా బక్రీద్ పండుగను చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ముత్తవల్లి డిపో శంషుద్దీన్, ఖాజీ ఫయాజ్‌బాషా, మౌలానా జక్రియ, మౌలానా ఫారుక్, మన్సూర్, మాజీ ముతవల్లిలు ఇక్బాల్, చాందు, టోపీ వలి, మైనుద్దీన్, బాబా ఫక్రుద్దీన్ (చోటు), మౌజాన్లు పక్రుద్దీన్, జక్రియ, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : బక్రీదు పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హేమాద్రి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిములతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా బక్రీద్ పండగ చేసుకోవాలన్నారు.

సిఎం చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రజా వేదిక వద్ద డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గత వైసిపి పాలనలో నిరుద్యోగులు భిక్షాటన చేసే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ప్రజా సంక్షేమం, నవరత్నాల పేరుతో ప్రజలను వంచించి మోసం చేశారని విమర్శించారు. అదే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే ఐదుహామీలపై సంతకం చేయడం ఆనందదాయకమన్నారు. ఎన్నికల మేనిఫెస్టో తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, పాపంపల్లి రామాంజనేయులు, వైపి రమేష్, గొల్ల వెంకటేశులు, గోళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బండారు శ్రావణిశ్రీని కలిసిన మురళీకృష్ణ

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని శనివారం అనంతపురంలోని నివాసంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సాకే మురళీకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్ర, జిల్లా సహాయ కార్యదర్శులు బొమ్మన పురుషోత్తంరెడ్డి, దివే కృష్ణమూర్తి, బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ ఎర్రిస్వామి, నాయకులు సాయిశంకర్, ముని, రాగే శివ, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం


బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ గౌతమీశాలి

అనంతపురం క్రైం : ఈ ఏడాది ఫిబ్రవరిలో మృతిచెందిన ఎ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ కుటుంబానికి కార్పస్ ఫండ్, విడో ఫండ్ కింద మంజూరైన రూ.1.50 లక్షల విలువజేసే చెక్కులను ఎస్పీ గౌతమిశాలి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్లు రామాంజనమ్మ, ఖాసింబీ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రహ్మసముద్రం, నంజాపురం, వేపులపర్తి 1, 2, 3 తదితర గ్రామాల్లో అంగన్వాడీల బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 'ప్రభుత్వ పాఠశాలలే ముద్దు.. ప్రయివేట్ పాఠశాల వద్దు' అంటూ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అలాగే మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిన్నారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం : పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ సమీపంలో శనివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. అటుగా వెళ్తున్న పాదచారులు శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ హరినాథ్ శవాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా పట్టణానికి చెందిన ఓ భిక్షగాడిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో బాది హతమార్చినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో నిందితులు అరెస్టు

గుంతకల్లు : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు నర్సింగ్‌హోం వద్ద శుక్రవారం కర్నూలు జిల్లా దౌల్తాపురం గ్రామానికి చెందిన మేకల శేఖన్నపై దాడి చేసిన ఘటనలో పాల్గొన్న ఐదుగురు నిందితులను శనివారం స్థానిక టివి స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 2వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితుడు మేకల శేఖర్, గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల ఓం ప్రకాష్ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ప్లాట్ల వ్యాపారంలో కమీషన్ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో గుత్తి మండలం రజాపురం, కొత్తపేట గ్రామాలకు చెందిన కావలి వెంకటేష్, పి.రామాంజినేయులు, గుంతకల్లు మండలం కొంగనపల్లి, పాత కొత్త చెరువు గ్రామాలకు చెందిన గూల్యం గోవర్ధన్, పుర్ర సురేందర్‌తో కలిసి ఓం ప్రకాష్ పట్టణంలోని నర్సింగ్‌హోం వద్ద రియల్ ఎస్టేట్ రూములో ఉన్న మేకల శేఖర్‌పై కట్టెలతో విచక్షణా రహితంగా దాడులు చేశారు. దీంతో అక్కడే ఉన్న నవీన్ గాయపడిన ఓంప్రకాష్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి 2వ పట్టణ సీఐ గణేష్ సిబ్బందితో గాలించి 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు ఐదుగురిపై రౌడీషీట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.